## జములమ్మ నిజరూప దర్శనం


నిజరూపంలో దర్శనమిస్తున్న జములమ్మ

గద్వాల రూరల్, అక్టోబర్ 24: నడిగడ్డ ఇలవేల్పు.. జములమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం 8గంటలకు విశేష ఫలంచామృతాభిషేకం, 9గంటలకు పుష్పాలంకరణ సేవలు, మంగళహారతి అనంతరం కుంకుమార్చన చేశారు. అదే విధంగా సాయంత్రం 5గంటలకు శమీపూజ, తెప్పోత్సవం, మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వితరణతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్, ఆలయ మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, ఆలయ డైరెక్టర్లు ఓంప్రకాశ్ కాంబ్లె, నాగరాజు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్
- కేంద్ర బలగాలతో సమావేశం


కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

ఉండవెల్లి, అక్టోబర్ 24: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల దవాఖానలో ఎస్పీ రితిరాజ్ అదనపు ఎస్పీ రవితో కలిసి కేంద్ర బలగాలతో సోమవారం సమావేశమై మాట్లాడారు. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజల సహకారంతో ప్రశాతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం కేంద్ర బలగాలకు ఏర్పాటు చేసిన వసతి సదుపాయలను పరిశీలించారు. వారికి అసౌకర్యం కలగకుండా చూడాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు.

## స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

- ఎస్సై కల్యాణ్‌రావు
- ఓటుహక్కుపై సీఆర్‌పీఎఫ్ అవగాహన ర్యాలీ


ఎల్కూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై కల్యాణ్‌రావు

మల్దకల్, అక్టోబర్ 24: ఓటుహక్కు ఉన్న ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఎలాంటి వత్తిడిలకు గురికాకుండా బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఎంచుకోవడానికి ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎస్సై కల్యాణ్‌రావు అన్నారు. మంగళవారం మల్దకల్, ఎల్కూర్‌లో జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పూజయ్య, కానిస్టేబుల్ నిరంజన్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

## 27 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

ధరూరు, అక్టోబర్ 24: అక్రమంగా తరలిస్తున్న 27 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా జమకండి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అశోక్ లేలాండ్ ట్రక్కులో కర్ణాటక నుంచి కర్నూలుకు తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున ధరూరు మండల కేంద్రంలో పట్టుకుని విచారించగా.. 27 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుబడింది. ట్రక్కు డ్రైవర్ అక్షయ్, ట్రక్కు ఓనర్ పరశురాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# చేరికల జోరు.. గులాబీ హోరు

- కదులుతున్న హస్తం పునాదులు
- బీరం రెండోసారి గెలుపునకు అభివృద్ధి పనులే ప్రచారాస్త్రాలు
- దూకుడు పెంచిన ఎమ్మెల్యే బీరం



ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన పాన్‌గల్ మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలేశ్(ఫైల్)

కొల్లాపూర్, అక్టోబర్ 24: అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో ఆయా రాజకీయ పార్టీల్లో కదలికలు మొదలయ్యాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లోకి హస్తం పార్టీ నుంచి చేరికల జోరు ఊపందుకుంటుంది. దీంతో గులాబీ పార్టీ దూసుకెళ్తున్నది. ప్రధానంగా మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరణకు గురై మళ్లీ హస్తం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ తెచ్చుకోవడంతో ఆయనకు గిట్టని వారంతా గులాబీలోకి దండుకడుతున్నారు. జూపల్లి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్‌లోకి చేరికల ప్రభంజనం రోజురోజుకి కొనసాగుతున్నది. తాజాగా ఈనెల 22న పాన్‌గల్ మండలకేంద్రంలో జరిగిన పార్టీ మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఆ మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగనమోని తిరుమలేశ్‌తోపాటు మరికొందరు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో కారెక్కారు. అదేరోజూ పెద్దకొత్తపల్లి మండలం మారెడుమాన్‌దిన్నెలో జూపల్లి వర్గానికి చెందిన ఇద్దరు వార్డు సభ్యులు సీతారాం, బేబీతోపాటు మరో 15మంది కార్యకర్తలు ఆ గ్రామ సర్పంచ్ సునీత నేతృత్వంలో ఎమ్మెల్యే బీరం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేరోజు రాత్రి పాన్‌గల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 60మంది కార్యకర్తలు కొల్లాపూర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ గూటికి చేరారు. అంతకు ఐదు రోజుల ముందు కోడేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నకేశవులుతోపాటు మరో 50మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌ను వీడి ఎమ్మెల్యే బీరం సమక్షంలో గులాబీ జెండాకు జైకొట్టారు. దీంతో హస్తం పార్టీ పునాదులు కదులుతున్నాయి. శని, సోమవారాల్లో కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 55మంది నాయకులు, కార్యకర్తలు ఆపార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ కొండ్ర బుచ్చయ్య ఆధ్వర్యంలో పట్టణంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీరం సమక్షంలో కారెక్కారు. అయితే జూలై మొదటివారం నుంచి ప్రతి తండాలు, గ్రామాల నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. అంతేకాకుండా మాజీమంత్రి జూపల్లికి ఎంతో సన్నిహితంగా ఉండే ఆయన వైఖరిపై విసిగివేసారి గతనెల 16వ తేదీన సీఎం కేసీఆర్ పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేసిన రోజున నాటి దివంగత ఎమ్మెల్యే బెక్కెం నర్సింహారెడ్డి తనయుడు పురేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బీరం సమక్షంలో చేరారు. అయితే కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలసలు కడుతుండడంతో తట్టుకోలేక పోతుండడంతో చేరికలకు బ్రేక్ వేసేందుకు హస్తం పార్టీ నాయకులు కొందరు నానా పన్నాగాలతో అప్పుడే ప్రలోభాలకు దిగుతూ డబ్బుల ఎరవేస్తూ తాత్కాలికంగా అడ్డుకట్టవేస్తున్నారని కూడా సమాచారం. మాజీ మంత్రి జూపల్లి 19ఏండ్ల కాలంలో ఎమ్మెల్యేగా, మంత్రి పదవులు ఒరగబెట్టినా కొల్లాపూర్ నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయకపోవడంపై జనం జీర్ణించుకోలేకపోతున్నారు. మళ్లీ ఆరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి హస్తం పార్టీ నుంచి కిందామీద పడి ఎలాగోలా జూపల్లి టికెట్‌ను పొందాడు. జూపల్లిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో తొలిసారిగా ఎమ్మెల్యేగా బీరం విజయం సాధించారు. ఐదేండ్ల కాలంలో రెండేండ్లు కరోనాతో కష్టకాలం ఉండగా, మిగతా రెండున్నర ఏండ్లలో అనతికాలంలోనే శాశ్వత అభివృద్ధి పనులు జనం ముందు కనబడుతున్నాయి. అంతేకాకుండా ఎమ్మెల్యే బీరం ప్రజల్లో మమేకమైపోవడం, ప్రజలను ఆప్యాయతగా పలుకరించి ప్రేమాభిమానాలను చూరగొనుతూ ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపు కోసం బీరం హర్షవర్ధన్‌రెడ్డి, సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులే ప్రచారాస్త్రాలుగా జనంలోకి తీసుకెళ్తున్నారు. దీంతో ఎమ్మెల్యే దూకుడు పెంచుతున్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావుతోపాటు ఎమ్మెల్యే బీరం గెలుపు కోసం అనుసరించే వ్యూహాలు, ప్రతివ్యూహాలతో దిశానిర్ధేశాలను గూర్చి తర్ఫీదునిస్తున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే బీరం సతీమణి విజయమ్మ సైతం బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటూ మహిళలను కూడగట్టడంలో దృష్టిని సారించారు.

### బీజేపీ చీరల పంపిణీతో ప్రలోభాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ అభ్యర్థి సుధాకర్‌రావు గతనెల రోజులుగా పరివర్తన యాత్రను అనేక గ్రామాల్లో కొనసాగిస్తున్నారు. ఈ యాత్రతోపాటు బతుకమ్మ వేడుకల పేరుతో సమావేశాలు ఏర్పాటు చేసి మహిళలను ముందస్తుగా చీరల పంపిణీతో ప్రలోభాలను కొనసాగిస్తున్నారని తెలిసింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎన్నికల అధికారుల దృష్టిలో పడకుండా ఈ యాత్ర కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందు కోసం సభలకు బైక్‌తో వచ్చే యువతకు ఐదు లీటర్లు చొప్పున ఉచితంగా పెట్రోల్‌కు టోకన్స్. ప్రతి రోజూ రాత్రిపూట జరిగే సభ సందర్భంగా మహిళలకు ముందుగా జాకెట్, తమలపాకులు, వక్కలతోపాటు టోకెన్ ఇస్తారు. ఆ టోకెన్ తీసుకొని ఆ పార్టీ నాయకులు సూచించే స్థానిక నాయకుడి ఇంటికి వెళ్తే సదరు మహిళలకు గుట్టుగా చీరల పంపిణీ ప్రక్రియ సాగిస్తున్నారు. తాజాగా సోమవారం ఉదయం వీపనగండ్ల మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకుడు తన ఇంటివద్ద చీరలను పంపిణీ చేస్తుండా ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు పట్టుకున్నారు. ఇంటిని సోదాలు చేసి చీరలను స్వాధీనం చేసుకొని వీపనగండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిప్రకాశ్ మంగళవారం తెలిపారు. పోలింగ్‌కు ఇంకా 35రోజుల వ్యవధి ఉండగానే బీజేపీ నాయకులు ఓటర్లను ముందస్తుగా ప్రలోభాలకు గురిచేయడాన్ని వివిధ ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే బీజేపీ నాయకులు మహిళలకు చీరలను పంపిణీ చేసేందు కోసం ఇప్పటికే భారీ ఎత్తున చీరలను గ్రామాల్లో దించారని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దీన్ని కట్టడి చేసేందుకు ఎన్నికల పరిశీలకులు ఏమేరకు దృష్టిని పెట్టి చర్యలు తీసుకుంటారో మరి.

## మొక్కజొన్న పంట ధ్వంసం

- రూ.4లక్షల మేరకు పంటనష్టం
- కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు

పెంట్లవెల్లి, అక్టోబర్24: మండల కేంద్రం సమీపంలో చేతికొచ్చిన మొక్క జొన్నపంట ధ్వంసం కావడంతో రైతు కన్నీరుమున్నీరైన ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. తమకు ఉన్న 4.20 ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేసుకున్నామని,గత కొద్ది సంవత్సరాల నుంచి మా భూమిని ఆర్‌ఎంపీ మల్లయ్య కబ్జా చేయాలన్న కుట్రతో మేము వేసుకున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారని, మాకు రూ.4లక్షల మేరకు పంటనష్టం వాటిల్లినట్లు, చివరకు మాకు ఆత్మహత్యే శరణ్యమన్నారు. ఈఘటనకు సంబంధించిన ఎస్సై బండారి సురేశ్ కథనం మేరకు.. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని నమాజ్ కట్ట సమీపంలో కుర్వ కృష్ణయ్య, కుర్వ బింగి నాగమ్మకు సర్వేనెంబర్ 657, 658లో 4ఎకరాల భూమిలో మొక్కజొన్న వేశారు..సోమవారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు మొక్క జొన్న పంటను ధ్వంసం చేశారని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.


ధ్వంసమైన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎస్సై సురేశ్

## గుర్తు తెలియని శవం లభ్యం

పాన్‌గల్, అక్టోబర్54: మండలంలోని మల్లాయిపల్లి గ్రామం ఈదుల చెరువులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు ఎస్సై వేణు తెలిపారు. గ్రామంలోని ఈదుల చెరువులో గుర్తు తెలియని శవం ఉందని గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మృతుడు(45), బట్టతల, నలుపురంగు మొహం, మొలతాడుకు నాగుపాము గుర్తు గల తాయత్తు ఉందని ఎస్సై తెలిపారు. పూర్తివివరాలకు మండల పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

# బాబాయిని చంపిన ప్రబుద్ధుడు

- రామకృష్ణాపురంలో దారుణ హత్య

కొత్తకోట, అక్టోబర్ 24 : సొంత బాబాయిని నీటిలో ముంచి చంపిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉప్పరి చిన్న బాలన్న (65), తన అన్న కుమారుడు రవికి రూ.40వేలు అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన అప్పును తిరిగి ఇవ్వాలని అడగా ఇది దృష్టిలో పెట్టుకొని మంగళవారం మధ్యాహ్నం తనకు అప్పు ఇవ్వలేదని, ఇచ్చినట్లు ఉంటే చెరువులో మునిగి చెప్పాలని ఊర చెరువు వద్దకు తీసుకెళ్లాడు. చిన్న బాలన్నను రవితోపాటు ఉమ్మళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చెరువులోకి తీసుకెళ్లి మూడు, నాలుగు సార్లు ముంచి తీవ్రంగా కొట్టారు. దీంతో బాలన్న మృతిచెందడంతో రవి మృతదేహాన్ని ఆటోలో తీసుకొచ్చి ఇంటి ముందు పడేసి వెళ్లిపోయాడు. కోడలు చంద్రకళ మామ మృతి చెందాడని గుర్తించి, గ్రామ పెద్దలకు తెలిపింది. ఈ విషయాన్ని పెద్దలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి దవాఖానలోని మార్చురీ తరలించారు. కోడలు చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.


బాలన్న మృతదేహం